
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

సోమవారం 3 ఫిబ్రవరి 2025



నత్తనడకన ఏటీసీ నిర్మాణం

● అరకొర సౌకర్యాలతోనే విద్యార్థులకు శిక్షణ

● సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐలో ముందుకు సాగని ఏటీసీ నిర్మాణాలు

7లో




కొమురవెల్లి ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తజన సందోహం

# జయహో మల్లన్నా

## మూడోవారం జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు

### పట్నాలు రచించి, బోనాలు నివేదించి మొక్కులు

చేర్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జయహో.. కొమురవెల్లి మల్లన్నా.. జయహో.. అంటూ వేలాది మంది భక్తితన్మయత్వం చెందారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవవారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం సాకపెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడుమని వేడుకున్నారు. తమ కోర్కెలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులు పడ్డారు. ఆలయ పరిసరాలలో పారిశుధ్య చర్యలు సక్రమంగా చేపట్టడం లేదు. ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో అపరిశుభ్రత నెలకొనడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు.



పట్నం వేయిస్తున్న భక్తులు

# నిలిచేదెవరో!

నేటి నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు

10 వరకు గడువు

కరీంనగర్‌లో నామినేషన్ కేంద్రం

ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, బీజేపీ

బీఆర్ఎస్ మద్దతు కోసం ఆశావహుల పోటీ

స్వతంత్రులుగానూ పెద్ద సంఖ్యలో బరిలోకి..

రసవత్తరంగా గ్రాడ్యుయేట్, టీచర్ల పోరు



| | |
|---|---|
| పట్టభద్రుల ఓట్లు | : 3,58,614 |
| ఉపాధ్యాయుల ఓట్లు | : 28,672 |
| శాసనసభ నియోజకవర్గాలు | : 42 |
| మండలాల సంఖ్య | : 271 |
| పోలింగ్ కేంద్రాలు | : 499 |

మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ శాసనమండలి నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల పోరు రసవత్తరంగా మారుతోంది. ఈ నెల 27న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నేటి నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇటీవల ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా నేడు నోటిఫికేషన్‌ను వెలువరిస్తారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మండలాలు 15 కొత్త జిల్లాల్లో విస్తరించాయి. ఈక్రమంలోనే ఆయా జిల్లాల్లో ఎన్నికల్ కోడ్ అమల్లోకి రానున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మాత్రమే నామినేషన్లను స్వీకరిస్తారు. నాలుగు జిల్లాల రిటర్నింగ్ అధికారిగా కరీంనగర్ కలెక్టర్ వ్యవహరించనున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 2: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌తో ఉమ్మడి మెదక్ జిల్లాలో మళ్లీ రాజకీయం వేడెక్కింది. గడిచిన లోక్‌సభ ఎన్నికల అనంతరం స్తబ్దుగా మారిన రాజకీయాలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో మరోసారి వెడెక్కాయి. అసెంబ్లీ, లోకసభ ఎన్నికల అనంతరం మరోసారి రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు మరోసారి ఎమ్మెల్సీ పోరులో తలపడనున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ కూడా అభ్యర్థిని ప్రకటిస్తే ప్రచారం జోరందుకోనుంది.

### ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ

గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన పట్టభద్రుల స్థానాన్ని పదిలం చేసుకోవడానికి ఆ పార్టీ పావులు కదుపుతోంది. కాంగ్రెస్ తరఫున కరీంనగర్‌కు చెందిన విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థిగా ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన చిన్నమైల్ అంజిరెడ్డిని ఆ పార్టీ ప్రకటించింది. ఆయన ఇప్పటికే బీజేపీ అనుబంధ సంస్థల

మిగతా 7వ పేజీలో.

## సంక్షేమ పథకాలకు ఎన్నికల కోడ్ అడ్డంకి!

మెదక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ) ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే జిల్లాలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. కేంద్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఈ నెల 26 రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. మెదక్, అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి కొనసాగుతున్నారు. టీచర్స్ నియోజకవర్గానికి రఘొత్తంరెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నారు. ఈ రెండు స్థానాలకు 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అడ్డంకిగా మారనుందా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే ప్రారంభించిన పథకాలు నిరాటంకంగా కొనసాగుతాయని, కొత్త పథకాలు ప్రవేశపెట్టడం మాత్రం సాధ్యపడదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నాలుగు పథకాలకు ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని ఎంచుకుని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. దీంతో, మిగతా గ్రామాల్లోనూ అమలు చేయడానికి ఏ ఆటంకం ఉండబోదని న్యాయ నిపుణులు, నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

### పథకాలు కొనసాగుతాయి

-ఆంజనేయులు గౌడ్ , డీసీసీ అధ్యక్షుడు

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా సంక్షేమ పథకాల అమలుకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. ఇప్పటికే మొదలైన సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

# నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

● నేటి నుంచి 22 వరకు నిర్వహణ

● మెదక్ జిల్లాలో 33 సెంటర్లు

● 4,592 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిఘా నీడలో నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. నేటి నుంచి ఈ నెల 22 వరకు నాలుగు విడతల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగనున్నాయి. మెదక్ జిల్లావ్యాప్తంగా 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న 4,592 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వాహణను ఫ్లయింగ్ స్క్వాడ్, అడ్‌హక్ కమిటీ పర్యవేక్షించనున్నారు. పరీక్షలకు హైపవర్ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీ, పర్యవేక్షులుగా డీఐఈవో ఉంటారు.



కాడిపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈవో మాధవి

### ఓటీపీతో ప్రశ్నాపత్రం

ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులకు అందజేసే ప్రశ్నాపత్రాన్ని ఇంటర్‌బోర్డు పకడ్బందీగా కాలేజీలకు పంపిణీ చేస్తోంది. కేంద్రాలకు ఎగ్జామినర్లు చేరుకున్న అనంతరం ఫోన్‌లకు ఓటీపీ వస్తుంది. ఓటీపీని నమోదు చేసిన తర్వాతనే ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుంటుంది. పరీక్షలకు ఆరగంట ముందు ప్రశ్నా పత్రాలు ఆన్‌లైన్‌లో ఉంచుతారు. కళాశాలలవారీగా ప్రశ్నాపత్రాల కోడ్‌లు వేర్వేరుగా ఉంటాయి. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే ఇన్విజిలేటర్ హాల్ టిక్కెట్ ఆధారంగా ప్రశ్నాపత్రం డౌన్‌లోడ్ చేసి ఇస్తారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి మాధవి తెలిపారు. సమస్యలుంటే 9240205555 నంబర్‌లో సంప్రందించాలని ఆమె సూచించారు.

## రెండు గ్రామాలతో మండల పరిషత్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామ పంచాయతీలతో జిల్లాలోనే అతిచిన్న మండల పరిషత్‌గా అమీన్‌పూర్ ఎంపీపీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. మండల పరిధిలోని ఆరు గ్రామపంచాయతీలను ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలు రద్దయ్యాయి. మండల పరిధిలో వడక్‌పల్లి, జానకంపేట గ్రామపంచాయతీలు మాత్రమే మిగిలాయి. వడక్‌పల్లి పంచాయతీ పరిధిలో 700 ఓటర్లకు మూడు ఎంపీటీసీ స్థానాలు, జానకంపేట పంచాయతీ పరిధిలో 600 ఓట్లకు రెండు ఎంపీటీసీ స్థానాలుగా పునర్విభజన చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేవలం ఐదు ఎంపీటీసీ స్థానాలతో రెండు గ్రామాలతో మండల పరిషత్, జడ్పీటీసీ స్థానం ఏర్పాటు చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ఐదు ఎంపీటీసీ స్థానాల్లో మూడు స్థానాలు గెలుచుకున్న వారికి ఎంపీపీ పదవి దక్కుతుంది. మరో వ్యక్తికి ఉపాధ్యక్ష పదవి లభిస్తుంది.

# లక్ష్యం.. బహుదూరం

అసంపూర్తిగా 'మన ఊరు-మన బడి' పనులు

తొలి విడతలో 441 పాఠశాలలు ఎంపిక

పనులు పూర్తయినవి 179 మాత్రమే

కాంట్రాక్టర్లకు రూ. కోట్లలో బిల్లుల బకాయిలు

కలగానే సర్కారు బడులకు కార్పొరేట్ హంగులు



అసంపూర్తిగా సంగారెడ్డిలోని బాయ్స్ హైస్కూల్ భవనం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమం మొక్కుబడిగానే మిగిలిపోయింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం కాగితాలకే పరిమితమైంది. మూడేళ్ల క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికే కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఈ కార్యక్రమంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిసారించడం లేదు.

### దాతల సహకారంతో..

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం 2022 జనవరిలో అప్పటి ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ప్రతీ పాఠశాలక ప్రహరీ, వంట గది, డైనింగ్‌హాలుతో పాటు లైబ్రరీ, ల్యాబొరేటరీ, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం తదితర వసతులను కల్పించే పనులకు ప్రణాళికలు రూపొందించారు. అవసరమైన నిధుల్లో కొంత ప్రభుత్వం సమకూర్చితే మరికొంత దాతల నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించారు.

### తొలి విడతనే దిక్కులేదు

సంగారెడ్డి జిల్లాలో వివిధ కేటగిరిలకు చెందిన 1,264 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు- మన బడి కార్యక్రమం తొలి విడతలో భాగంగా 441 ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టాలని జిల్లా యంత్రాంగం ఎంపిక చేసింది. ఈ పనులు పూర్తి చేసేందుకు అదే సంవత్సరం జూన్ 12 వరకు డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. అయితే, మూడేళ్ల గడుస్తున్నా తొలి విడత ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. 329 పాఠశాలల్లో రూ.30 లక్షల లోపు అంచనాలతో పనులను మంజూరు చేశారు. వీటిలో నాలుగు పాఠశాలల్లో ఇప్పటికీ పనులు ప్రారంభించనేలేదు. 102 పాఠశాలల్లో రూ.30 లక్షలకుపైగా అంచనాలతో పనులు మంజూరయ్యాయి. ఇందులోనూ 6 పాఠశాలల్లో పనులు ఇప్పటికీ మొదలు పెట్టలేదు. ఆయా స్కూళ్లలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికార యంత్రాంగం పేర్కొంటున్నది. 179 పాఠశాలల్లో వివిధ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 262 ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా మిగిలాయి. అత్యవసరమైన గ్రీన్‌చాక్ బోర్డులు, డ్యుయల్ డెస్క్‌లు, కుర్చీలు, టేబుళ్లు కూడా చాలా బడులకు చేరలేవు. పాఠశాల ప్రహరీలపై విద్యా ప్రాముఖ్యత, జాతీయ నేతల గురించి వివరించేలా పెయింటింగ్స్ వేయించలేదు. ఇప్పటివరకు చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.45 కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించగా, మరో రూ.65 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



పోతిరెడ్డిపల్లి హైస్కూల్‌లో పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన డైనింగ్‌హాల్ నిర్మాణం

# వైద్యసేవలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు

## మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆదివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌రూం, పరీక్షల ల్యాబ్, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సంఖ్య ఎంత ఉన్నదో అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోగులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. జాతీయ రహదారి పక్కన ఉన్నందున రోడ్డు ప్రమాద బాధితులను తీసుకువస్తే ఆలస్యం చేయకుండా వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్





వనదుర్గామాతను దర్శించుకున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

# దుర్గమ్మ దర్శనానికి బారులు

పాపన్నపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుని బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు నెరవేర్చు తల్లీ అంటూ ముడుపులు కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాల వితరణ చేసి ఆశీర్వచనాలనందించారు. నూతన వాహనాలకు అమ్మవారి సన్నిధిలో పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

### అమ్మవారి సేవలో నాయకులు, అధికారులు

ఏడుపాయల దుర్గామాతను ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఐఏఎస్ అధికారి, సైబర్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఘనంగా సన్మానించారు.


నేటి నుంచి 'తిరుమలయ్య' జాతర

స్వయంభుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుడు 7

కాకతీయులు నిర్మించిన ఆలయం






మెదక్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన భక్తులు

# సీఎస్ఐ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. మహాలయం ఏసు నామస్మరణతో మార్మోగింది. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన శిలువ వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించారు. మత గురువులు భక్తులకు ఆశీర్వచనాలందించారు.

## అబాకస్ పరీక్షలో శ్రీజ స్టేట్ ఫస్ట్


ట్రోఫీ, పత్రంతో శ్రీజ

పాపన్నపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షలో పాపన్నపేట శ్రీ విద్య స్కూల్ విద్యార్థిని ప్రథమ ర్యాంక్ సాధించింది. హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఇందులో 600 పాఠశాలలకు చెందిన 780 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టార్ జూనియర్ కేటగిరీలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలోని 71 పాఠశాలల నుంచి 142 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. శ్రీజ మొదటి ర్యాంక్ సాధించింది. శ్రీజను పాఠశాల ప్రినిపల్ రవీందర్‌గుప్తాతో పాటు కరస్పాండెంట్ నీరలాక్షప్ప, సుమన్, ఉపాధ్యాయురాలు స్రవంతి, ప్రియాంక, దుర్గ, ఉపాధ్యాయ బృందంను అభినందించారు.

# వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి

మెదక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందిన సంఘటన మెదక్, వెల్దుర్తి, నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో చోటు చేసుకున్నది. ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనగా ఒకరు అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన రామాయంపేట పాత హైవేపై జరిగింది. హైదరాబాద్ రూట్‌లో పెట్రోల్ కోసం వాహనదారుడు క్రాస్ చేసి ఎదురుగా వస్తున్న పోచమ్మల స్వామి(50)ని బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. మరొకరు తీవ్రంగా గాయపడగా.. చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కాగా రామాయంపేట పట్టణానికి చెందిన మృతుడు పోచమ్మల స్వామికి భార్య వాణి, ఓ కుమారుడు ఉన్నారు. ఎస్ఐ బాలరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమానాస్పద స్థితిలో..

వెల్దుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వెల్దుర్తి పట్టణంలోని కోటకింద కాలనీకి చెందిన ఆశల నర్సయ్య(50) హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. గతంలో పక్షవాతం బారినపడడంతో కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఆదివారం ఉదయం చూసేసరికి ఇంట్లో మృతిచెంది ఉన్నాడు. నర్సయ్య పేరిట ఉన్న భూమిని విక్రయించగా రూ.21,60,000 లక్షలు వచ్చాయని, డబ్బుల కోసం నర్సయ్యను తన భార్య ఎల్లమ్మ చంపినట్లు అనుమానం ఉందని మృతుడి అన్న ఆశయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని సీఐ రంగాకృష్ణ సందర్శించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### సామ్యతండాలో మరో వ్యక్తి..

శివ్వంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సామ్యతండాలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని టిక్య దేవమ్మగూడెం పంచాయతీ పరిధి సామ్యతండాకు చెందిన మాలోత్ మదన్‌లాల్(38) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య మాలోత్ సరిత కుటుంబ తగాదాలతో 18 నెలల క్రితం కూతురును తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా మదన్‌లాల్ తల్లిదండ్రులు మృతిచెందడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం ఇంట్లో వీపులో గాయాలై రక్తం మడుగులో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

### బోరు వాహనం, బైక్ ఢీ ఒకరు...

నర్సాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై నర్సాపూర్ పట్టణ సమీపంలో మూతపడ్డ అల్యూమినియం పరిశ్రమ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం టిక్యాతండాకు చెందిన అంజి(36) ఆదివారం నర్సాపూర్-వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్నాడు. నర్సాపూర్ నుంచి వస్తున్న బోరు వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో అంజికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో సాయంత్రం మృతిచెందాడు.

### చికిత్స పొందుతూ..


వెల్దుర్తి: మృతుడి ఒంటిపై గాయాలను పరిశీలిస్తున్న సీఐ రంగాకృష్ణ.

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఓ వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 28న పట్టణంలోని న్యూ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి(35) అపస్మారక స్థితిలో పడి ఉండడంతో పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందగా.. మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు సీఐ వెల్లడించారు. మృతుడి బంధువులు, తెలిసినవారు ఉంటే 8712657913, 8712657914 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడు ప్రమాదంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేటలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యాదగిరి(54) కూడవెల్లి జాతరకు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా పోతరెడ్డిపేట సబ్‌స్టేషన్ వద్ద పంది ఎదురుగా రావడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో సిద్దిపేట ఆసుపత్రి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తును చేస్తున్నట్టు తెలిపారు.







## మహ్మద్ ప్రవక్త జీవిత ఘట్టాలపై చిత్ర ప్రదర్శన


ప్రదర్శన వివరాలు తెలుకుంటూ తిలకిస్తున్న సందర్శకులు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మొహమ్మద్ ప్రవక్త జీవిత ఘట్టాలు, మక్కా, మదీనా ప్రత్యేకతలను వివరిస్తూ ఆదివారం మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్‌లో జమాతే ఇస్లామిక్ హింద్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రప్రదర్శనపై ప్రత్యేక పోటీలు నిర్వహించారు. దాదాపు 168 మంది పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు సయ్యద్ అజీజ్, జకి, డాక్టర్ సూఫీ సుజాయత్ ఆలీ, మాజీ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

హవేళిఘణపూర్/మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్దన గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ రాజేశ్వర్‌రావు తండ్రి సర్వోత్తమరావు శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆదివారం రాజేశ్వర్‌రావు, మృతుడి భార్య రుకుంబాయిని పరామర్శించారు. వీరి వెంట నాయకులు లావణ్యరెడ్డి, రాధాకిషన్ యాదవ్, సతీష్‌రావు, సాప సాయిలు ఉన్నారు. అలాగే ఇటీవల హెర్నియా వ్యాధి బారినపడి చికిత్స చేయించుకున్న మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన ఎంబీపూర్ మహేష్‌యాదవ్ తల్లి లక్ష్మిని మెదక్ జిల్లా ఆసుపత్రిలో పద్మారెడ్డి పరామర్శించారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఎం.లావణ్యరెడ్డి తదితరులు ఉన్నారు.


## తల్లీకొడుకు అదృశ్యం


మెదక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. రామాయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌కు చెందిన యాదమ్మ(30) పదేళ్ల కొడుకు రిత్విక్ పుట్టింటి నుంచి ఉదయం వెళ్లారు. తిరిగి ఇంటికిరాకపోవడంతో యాదమ్మ తల్లి భాగవ్వ పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ బాలరాజ్ విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే యాదమ్మకు అదే గ్రామంలోని మరో వ్యక్తితో వివాహం జరిగింది. కొన్నాళ్లుగా మనస్పర్థలు రావడంతో తల్లిగారి ఇంట్లోనే నివసిస్తున్నది.

## పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

జిన్నారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హేర్ సెలూన్ పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దుండగుడు అపహరించాడు. ఆదివారం జిన్నారం మండలం ఊట్ల గ్రామానికి చెందిన మంగళి అంజనేయులు గ్రామ శివారులోని రైస్‌మిల్ వద్ద ఉన్న తక హేర్ సెలూన్ షాప్ పక్కన బైక్‌ను పార్క్ చేశాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో బైక్ కనిపించక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఓ వ్యక్తి చోరీ చేసి జంగంపేట గ్రామం వైపు వెళ్లినట్లు గుర్తించారు.
















## రాయపోల్ విద్యార్థినికి గోల్డ్ మెడల్




కళశలింగం విశ్వవిద్యాలయం నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మానస

రాయపోల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ విద్యార్థిని గల్వ మానస బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో గోల్డ్ మెడల్ అందుకున్నది. తమిళనాడులోని కృష్ణన్ కోయిల్ ప్రాంతంలోని కళశలింగం అకాడమీ ఆఫ్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఆమె బీటెక్ ఫుడ్ టెక్నాలజీ పూర్తి చేశారు. ఈ కోర్సులో ఉత్తమ ఫలితాన్ని సాధించడంతో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానసకు కళశలింగం విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. మానసను తల్లిదండ్రులతో పాటు పలువురు అభినందించారు.

## 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' బాక్సింగ్‌లో సాయితేజగౌడ్‌కు కాంస్య పతకం

**జిల్లా పోలీసు అధికారుల అభినందనలు**



కాంస్య పతకంతో సాయితేజగౌడ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : 3వ తెలంగాణ స్టేట్ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025 గతనెల 28వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీవరకు కరీంనగర్‌లో జరిగింది. ఈ క్రీడా పోటీల్లో సంగారెడ్డికి చెందిన కానిస్టేబుల్ కె.సాయితేజగౌడ్ బాక్సింగ్‌లో కాంస్య పతకం సాధించి ప్రతిభ కనబర్చారు. బాక్సింగ్‌లో 60-65 కేజీల బరువు సామర్థ్యంలో సాయితేజగౌడ్ కాంస్య పతకం సాధించడం పట్ల జిల్లాకు చెందిన పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

## యూత్ పార్లమెంట్ పోటీలకు వర్గల్ నవోదయ విద్యార్థులు

వర్గల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నాగపూర్ జిల్లా నావోగావ్ కేరిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 4న జరిగే ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనడానికి వర్గల్ జవహర్ నవోదయ విద్యార్థుల జట్టు ఆదివారం బయలుదేరినట్లు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ ప్రాంతీయ స్థాయి పోటీల్లో వర్గల్ జవహర్ నవోదయ జట్టుతో పాటు గుజరాత్‌లోని పల్సార్ జిల్లా నవోదయ జట్ల మధ్య పోటీ జరగనున్నట్లు తెలిపారు. 55 మంది సభ్యులతో ఉన్న జట్టులో 30 మంది బాలికలు, 25 మంది బాలులు ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు ఐదుగురు టీచర్లు కూడా వెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రాంతీయ స్థాయిలో చక్కటి ప్రతిభను చూపిన విద్యార్థుల జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు.

## లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సిద్దిపేట జిల్లా జడ్జి



ఆలయంలో పూజలు చేస్తున్న జిల్లా జడ్జి సాయి రమాదేవి

బెజ్జంకి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహస్వామిని సిద్దిపేట జిల్లా జడ్జి సాయి రమాదేవి కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. జడ్జిని ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుకునూరుపల్లి మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలు

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన కుకునూరుపల్లి మండలంలో మొదటిసారి పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో 18,622 జనాభా ఉండగా ఎంపీటీసీ స్థానాల సంఖ్య ఐదుకు చేరింది. కొత్త మండలం కావడం, మల్లన్నసాగర్‌లో పలు గ్రామాలు ముంపునకు గురికావడంతో పలు మార్పులతో మూడు కొత్త ఎంపీటీసీ స్థానాలు ఏర్పడ్డాయి. లకుడారం ఎంపీటీసీ పరిధిలో లకుడారం, మెదినీపూర్, మాత్‌పల్లి, కొనాయిపల్లి గ్రామాలు, చిన్నకిష్టాపూర్ ఎంపీటీసీ పరిధిలో చిన్నకిష్టాపూర్, ఎల్లయ్యగూడ, వీటీ వెంకటాపూర్, రాయవరం, రామచంద్రాపూర్ గ్రామాలు, మంగోల్ ఎంపీటీసీ పరిధిలో మంగోల్, తిప్పారం, కుకునూరుపల్లి-1, కుకునూరుపల్లి 1వ వార్డు నుంచి 8వ వార్డు ఉన్నాయి. మిగతా రెండు స్థానాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మండలం ఏర్పడ్డ తర్వాత మొదటిసారి జరిగే ఎన్నికలు జరగనుండడంతో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అనంతమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఆశ్రమ పీఠాధిపతులు మాధవనానంద సరస్వతి

దుబ్బాక, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ చేర్వాపూర్ అనంత మహాలక్ష్మి దేవాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలను ప్రధాన అర్చకుడు వేలేటి జయ రామశర్మ నిర్వహించారు. కుంకుమార్చనతో పాటు పలు వైదిక కార్యక్రమాలను ఘనంగా జరిపారు. ఆలయంలోని భక్తులనుద్దేశించి, తొగుట రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతులు మాధవనానంద సరస్వతి స్వామి ప్రవచనాలను బోధించారు.

## కార్యకర్తలకు అండగా కాంగ్రెస్




సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రీకాంత్

కొండపాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పార్టీ పటిష్టత కోసం అవిశ్రాంతంగా పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ ఉన్నారు. ఆదివారం కొండపాక మండలం దమ్మక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయకుమార్ అధ్యక్షతన కొండపాక మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు పార్టీ కోసం కృషి చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశం, ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు సంతోష్, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మామిడికి గడ్డుకాలం

**ఈసారీ మామిడిచెట్లపై కనిపించని పూత**



నంగునూరు మండలం వెంకటాపూర్‌లో పూత రాని మామిడి తోట



- అక్కడక్కడ ఆశిస్తున్న తేనెమంచు పురుగు
- సిద్దిపేట జిల్లాలో 17 వేల ఎకరాల్లో మామిడి తోటలు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఉద్యాన శాఖ అధికారులు

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మామిడి తోటలకు ఈ ఏడాది గడ్డు పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే రావాల్సిన మామిడి పూత కనిపించడంలేదు. రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడా వచ్చినా తేనెమంచు పురుగు ఆశిస్తుండడంతో రైతన్నలు రందీ పడతుఉన్నారు. రెండు మూడేళ్లుగా మామిడి పంట దిగుబడి సరిగా రావడం లేదని, ఈసారైనా వస్తుందో, రాదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 17 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. సీజన్‌లో ధర టన్నుకు కనిష్టంగా రూ.30-40 వేలు పలుకుతుంది. సాధారణ పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు పెట్టుబడులు పెరిగిపోవడం, కూలీలు దొరక్కపోవడంతో రైతులు మామిడి తోటలపై మొగ్గుచూపుతున్నారు.

### వాతావరణ పరిస్థితులతోనే..

మామిడి పూత సాధారణంగా నవంబర్ చివరి నుంచి ప్రారంభమై డిసెంబరు, జనవరి వరకు వస్తుంటుంది. పూత ఆలస్యమైన కొద్దీ ఉష్ణోగ్రతలు పెరిగి, పూత, పిందెలు రాలిపోతుంటాయి. ఏప్రిల్, మే నెలల్లో వచ్చే వడగాలులకు కాయలు రాలిపోతుంటాయి. అయితే, కొన్ని నెలలుగా వాతావరణంలో అనుకోకుండా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలతోపాటు తేమ శాతం పెరగడం, చలి ప్రభావంతో మొగ్గలు బిగుసుకుపోయి, సరిగా విచ్చుకోవడం లేదు. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రాత్రివేళల్లో కురిసే మంచు కూడా పూతపై ప్రభావం చూపుతోంది. పూత నుంచి పిందె వచ్చే వరకు పొడి వాతావరణం ఉండాలి. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

### తేనె మంచు పురుగు బెడద..

మూడేళ్లుగా మామిడికి పూత రాకపోవడం, వచ్చినా నిలవకపోవడం, విపరీతంగా తేనెమంచు పురుగు ఆశిస్తుండటంతో మామిడి రైతుకు అనుకున్న దిగుబడి రావడం లేదు. పూతకు ముందుగానే తెగుళ్లు, పురుగులు ఆశించకుండా మామిడి తోటల్లో ఒక్కో రైతు కనీసం ఎకరాకు రూ.20వేల విలువైన క్రిమిసంహారక ముందులు పిచికారీ చేయిస్తున్నారు. అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నా పూత రావడం, వచ్చినా నిలవడం కష్టమవుతోంది. మామిడి చెట్లు పూతకు రావాలంటే బెట్ట పరిస్థితులు ఉండాలి. కానీ, గతేడాది సెప్టెంబర్ వరకు అధిక వర్షాలు కురిశాయి. భూమంతా తేమతో ఉంది. ఏటా కాయలు తెంపగానే, వర్షాకాలంలో చెట్లను ప్రూనింగ్(కొమ్మల కటింగ్) చేయిస్తే కొత్తగా వచ్చే కొమ్మలకు, రెమ్మలకు పూత వస్తుంది. జనవరి నెల పూర్తయినా పూత రాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే, మామిడి పూతల సీజన్ రాగానే.. తోటల వెంట పరుగెత్తే లీజుదారులు ఈసారి వాటివైపే చూడటం లేదని రైతుల అంటున్నారు.

### ఖర్చులు పెరుగుతున్నాయి



మా మామిడి తోటలో ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలు ఖర్చు పెట్టి, అన్ని యాజమాన్య పద్ధతులు పాటించాను. అయినా పూర్తి స్థాయిలో పూత రాలేదు. ఏటా మామిడి తోటలకు పెట్టుబడి పెరుగుతూనే ఉంది కానీ దిగుబడి మాత్రం అంతంత మాత్రమే వస్తుంది. మూడేళ్లలో పూత సరిగా రావడం లేదు. ఈసారి ఏం చేస్తుందో చూడాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, మామిడి రైతు, బందారం

### ఉష్ణోగ్రతలు పడిపోవడంతో..



తేమ వాతావరణం ఉండటం, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడం మామిడి పూతపై ప్రభావం చూపుతున్నాయి. అక్కడక్కడ వచ్చిన పూతకు తేనెమంచు పురుగు, ఇతర తెగుళ్లు ఏమైనా ఉంటే రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- సువర్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

### సస్యరక్షణ చర్యలివే..

- పచ్చిపూత దశలో అంటే పూత కాడలు బయటకు వచ్చే పూలు వికసించకుండా ఇంకా మొగ్గ దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారి చేస్తే తేనె మంచు పురుగులను నివారించుకోవచ్చు.
- పురుగు పూత చుట్టూ గూడుగా ఏర్పరచుకొని, పూతను తిని విపరీతంగా నష్టపరుస్తుంది. దీంతో పూల గుత్తుల్లో పిందెలు ఏర్పడవు. ఈ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పూల గుత్తులపై పిచికారి వేయాలి.
- చల్లని రాత్రులు, వెచ్చని పగటి వాతావరణంలో పూత కాడలపై, పూల మీద తెల్లని పొడి లాంటి (బూడిద తెగులు) బూజు ఏర్పడుతుంది. దీని నివారణకు మొగ్గలు కనిపించిన దశలో లీటరు నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం కలిపి పిచికారి చేయాలి.
- పూత దశలో బూడిద తెగులు కనిపిస్తే లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా డైనోకాప్ 1 మి.లీ. చొప్పున కలిపి పూత కాడలు తడిచేలా పిచికారి చేయాలి.
- పూత మాడు తెగులు నివారణకు మొగ్గ బయటకు వచ్చే దశలో 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్, పచ్చిపూత మీద 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫినైట్ మిథైల్ ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- పూత రాలకుండా ఉండేందుకు ప్లానోఫిక్స్ 1.మి.లీ.ను 4 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

# నేటి నుంచి తిరుమలయ్య జాతర

**స్వయంభుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుడు ● కాకతీయులు నిర్మించిన ఆలయం**



తిరుమలయ్య స్వామి దేవస్థానం



తిరుమలయ్య స్వామి కమాన్

నిజాంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్న తిరుమలయ్య ఆలయం అధ్యయనోత్సవాలకు ముస్తాబైంది. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి చల్మెడ శివారులో శ్రీవేంకటేశ్వరుడుగా తిరుమలయ్య పేరిట స్వయంభుగా వెలసిన ఈ ఆలయాన్ని కాకతీయుల కాలంలో నిర్మించారని శాసనాలు చెబుతున్నాయి. నేటి నుంచి మూడు రోజులు జరిగే జాతరకు జిల్లాతో పాటు పొరుగున ఉన్న సిద్దిపేట, కామారెడ్డి వేలాదిగా భక్తులు తరలివచ్చి వేంకటేశ్వరుని దర్శించుకుంటారు.

### మూడు రోజులు అధ్యయనోత్సవాలు

మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలోని అతి పెద్ద బండపై 282 ఎకరాల్లో తిరుమలయ్య ఆలయం విస్తరించి ఉంది. దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకున్న అనంతరం ఇక్కడ ఏటా మాఘమాసంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మంగళవారం ధ్వజారోహణం, దేవతాహ్వానం, అభిషేకం నైవేద్యం హారతి, సాయంత్రం ఎడ్లబండ్లు, కాల్యాణం ఉంటాయి. బుధవారం బాల భోగం, రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

### ఏర్పాట్లు పూర్తిచేశాం

తిరుమలయ్య ఆలయంలో అధ్యయనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్య తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

- అక్కపల్లి రాంరెడ్డి, ఆలయ చైర్మన్



జాతరకు వచ్చే భక్తులు,పిల్లల కోసం ఏర్పాటైన రంగులరట్నం



ఆలయం తూర్పు దిక్కున కోనేరు

# నిలిచేదెవరో!

5వ పేజీ తరువాయి..

మద్దతుతో ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ తరఫున కరీంనగర్‌కు చెందిన విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. గతంలో పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన పట్టభద్రుల స్థానాన్ని పదిలం చేసుకోవడానికి కాంగ్రెస్ పావులు కదుపుతోంది. కాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విషయంలో బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య పోటీకి దిగారు. టీచర్ల ఓట్లను ఆకర్షించడంపై ఆయన దృష్టి పెట్టారు. ఉపాధ్యాయ స్థానానికి మాత్రం కాంగ్రెస్ పార్టీ ఎవరికి మద్దతిస్తుందో స్పష్టత లేదు.

### బీఆర్ఎస్ నిర్ణయంపై ఆసక్తి

ఉమ్మడి మెదక్‌లో హరీశ్‌రావు, కరీంనగర్‌లో కేటీఆర్, నిజామాబాద్‌లో కవిత ప్రభావం ఉంటుంది. ఈ మూడు జిల్లాలతోపాటు ఆదిలాబాద్ వ్యాప్తంగా జరుగుతున్న ఎమ్మెల్సీల పోరాటంలో బీఆర్ఎస్ పాత్రపై నేటికీ అస్పష్టత నెలకొంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ బీఆర్ఎస్ ఉనికి చాటాలని ఆ పార్టీలోని కొందరు నేతలు ఇటీవల ప్రస్తావనకు తెచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రైవేట్ స్కూల్స్ సంఘాల నాయకుడు యాదగిరి శేఖర్‌రావు, ఇదే జిల్లాకు చెందిన ప్రసన్న హరికృష్ణ పేర్లను ప్రధానంగా పరిశీలిస్తోంది. హరికృష్ణ ఇటీవలే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇక డీఎస్పీగా పనిచేసి రాజీనామా చేసిన నిజామాబాద్ జిల్లా వాసి మదనం గంగాధర్ కూడా బీఆర్ఎస్ పరిశీలనలో ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన మాజీమేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పేరు కూడా వినిపిస్తోంది. ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్. రావు సైతం బీఆర్ఎస్ పరిశీలనలో ఉన్నట్లుగా సమాచారం. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలోనూ బీఆర్ఎస్ ఆచితూచి వ్యవహరిస్తోంది.

### టీచర్ల పోరూ రసవత్తరమే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు కూడా ఆసక్తికరంగానే మారింది. పీఆర్‌టీయూ అభ్యర్థిగా బరిలో నిలిచిన వంగ మహేందర్‌రెడ్డి ఇప్పటికే అన్ని జిల్లాలతోపాటు పలు పాఠశాలలను సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. ఉపాధ్యాయ ఓటర్ల నమోదులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే తమకు లాభిస్తుందని ధీమాతో ఉన్నారు. బలమైన సంఘంగానూ పీఆర్‌టీయూకు పేరుంది. ఇక బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య తపస్ ఉపాధ్యాయ సంఘంతోపాటు పలువురి మద్దతుతో ప్రచారం చేస్తున్నారు. టీపీటీఎఫ్ అభ్యర్థిగా వై.అశోక్‌కుమార్ బరిలో నిలిచి వామపక్షాలు, కమ్యూనిస్టు భావజాల ఉపాధ్యాయ సంఘాలను సమీకరిస్తున్నారు. ప్రైవేట్ స్కూల్స్ తరఫున పోటీకి దిగుతున్న జగ్గు మల్లారెడ్డి కూడా ఇప్పటికే పలు జిల్లాల్లో పర్యటించారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వ విద్యాసంస్థల సిబ్బందిని ఓట్లు అడుగుతున్నారు.

### ఇవీ వివరాలు..

పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ పరిధిలో ఈ క్రింది జిల్లాలు ఉన్నాయి. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని మండలాలు విస్తరించిన కొత్త జిల్లాల్లో ప్రస్తుతం ఎన్నికల సందడి నెలకొంది.

జిల్లాలు: మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, జయశంకర్‌భూపాలపల్లి, హనుమకొండ, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య!



ఆత్మహత్యకు పాల్పడిన ప్రశాంత్

కొండపాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపాకలో ఆదివారం చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కొండపాక గ్రామానికి చెందిన మర్కంటి ప్రశాంత్ (29) బీఈడీ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటూ పోటీపరీక్షలకు సిద్ధమవుతూనే వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శనివారం రాత్రి ప్రశాంత్ బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ప్రశాంత్ తండ్రి ఎల్లయ్య పాలు పితకడానికి పొలానికి వెళ్లగా చింత చెట్టుకు ప్రశాంత్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపారు. ప్రశాంత్ సెల్ ఫోన్‌ను పరిశీలించగా, అతడు ఎవరో అమ్మాయిని ప్రేమించినట్లుగా తెలిసింది. ఆ అమ్మాయి దక్కలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## మిషన్ భగీరథ పైపులు దగ్ధం

● రూ.6 లక్షల నష్టం



మంటలను ఆర్పుతున్న సిబ్బంది


మునిపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో మిషన్ భగీరథ పంపుహౌస్ సమీపంలో ప్రమాదవశాత్తు గడ్డికి మంటలు చెలరేగి అక్కడే నిల్వ చేసిన మిషన్ భగీరథ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్టోర్ సూపర్‌వైజర్ సురేష్ ఫైరింజన్‌కు సమాచారమందించారు. వారు వచ్చేసరికి పైపులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ.6 లక్షల నష్టం వాటిల్లింది.

## రూ.11కోట్లు మంజూరు

చేర్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, బచ్చన్నపేట, తరిగొప్పుల, నర్మెట్ట మండలాల్లోని పలు గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.11కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయా మండలాలలో నెలకొన్న స్థానిక అవసరాలపై ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి గతేడాది సెప్టెంబరు 4న, నవంబరు 22, జనవరి 21 తేదీల్లో ఇంజనీర్ ఇన్ చీఫ్ అధికారికి ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. ఆయా ప్రతిపాదనలు ఆమోదించిన ప్రభుత్వం గత జనవరి 28న జీవో ఆర్‌టీ నెం.78 ద్వారా రూ.11కోట్లు నిధులు మంజూరు చేసిన ట్లు తెలిపారు.

# నత్తనడకన ఏటీసీ

- అరకొర సౌకర్యాలతో విద్యార్థులకు శిక్షణ
- సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐలో నెమ్మదించిన ఏటీసీ నిర్మాణాలు



ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నత్తనడకన కొనసాగుతున్న ఏటీసీ నిర్మాణం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యం పెంపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది. స్వయం ఉపాధితో పాటు అనేక అవకాశాలు మెండుగా ఉన్న ఐటీఐ కళాశాలలను బలోపేతం చేసి నైపుణాభివృద్ధి చేస్తే ఎంతోమంది విద్యార్థులకు మేలు జరుగుతుండటంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేసేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల (ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ) ప్రాంగణంలో టాటా టెక్నాలజీ సంస్థ సహకారంతో సుమారు రూ.4.50 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు గత జూన్ నెలలో శ్రీకారం చుట్టారు. అయితే ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏటీసీకి సంబంధించిన పనులు ఇంకా నిర్మాణ దశలో ఉండడం గమనార్హం.

### శిక్షణకు ఆటంకం

సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏటీసీ ఏర్పాటులో భాగంగా గతేడాది కొత్తగా ఆరు రకాల ట్రేడ్లు అందుబాటులోకి తెచ్చారు. ఆయా ట్రేడ్లలో 172 విద్యార్థులు సైతం గతేడాది అడ్మిషన్ తీసుకొని శిక్షణ పొందారు. అయితే వీరికి శిక్షణ ఇచ్చేందుకు నిర్మిస్తున్న ఏటీసీ నిర్మాణం పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు అరకొర సౌకర్యాల నడుమ పక్కనే ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల తరగతి గదుల్లో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఏటీసీ నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

## న్యూస్ బాక్స్

### ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్

మెదక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సీహెచ్ కోనాపూర్‌లో నిర్మించిన జేపీఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శుభకారాలు జరుపుకునేందుకు విలాసమైన ఫంక్షన్‌హాల్‌ను నిర్మించిన జేపీఎల్‌ఆర్ ఫంక్షన్ ఓనర్‌ను స్పీకర్ అభినందించారు. ఈ సందర్భంగా జేపీఎల్‌ఆర్ బృందం పూలమాల, బొకే, శాలువాలతో స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3న చిన్నశంకరంపేట మండలంలోని మడూర్, శాలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లోని విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఆదివారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో శాలిపేట, మడూర్, ఖాజాపూర్, చెన్నాయిపల్లి, సంగాయిపల్లి, వెంకట్రావుపల్లి, గజగట్లపల్లి, రామాయపల్లి గ్రామల్లోని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

### 'ఉపాధి కూలీ బీమా ప్రవేశపెట్టాలి'

నిజాంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీలకు ఇచ్చే రైతుబీమా మాదిరిగా ఉపాధి కూలీలకు కూలీబీమా ప్రవేశపెట్టాలని, వంద నుంచి రెండొందల పనిదినాలు పెంచాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాసి సంజీవ్ డిమాండ్ చేశారు. 19వ జాతీయ ఉపాధి కూలీల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు.

### గురుకుల ప్రవేశ గడువు పొడిగింపు

తూప్రాన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గురుకుల ప్రవేశ దరఖాస్తుల గడవు ఈనెల 6 వరకు పొడిగించినట్లు తూప్రాన్ (దాతర్‌పల్లి) గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో ఐదో తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల ఒకటితో గడువు ముగియగా, గురుకుల కార్యదర్శి డా.అలుగు వర్షిణి ఈనెల 6 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు.

### బేకరీలో షార్ట్‌సర్క్యూట్

నర్సాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని సంగారెడ్డి మార్గంలోని శ్రీ బాలాజీ బేకరీలో ఆదివారం ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దుకాణ నిర్వాహకుడు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### ఘనంగా మాచవరం పాఠశాల వార్షికోత్సవం

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పరిధిలోని మాచవరం ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యయరు. మెదక్ జిల్లాలో తొలిసారిగా ఒక ప్రభుత్వ పాఠశాల చరిత్రపై ప్రధానోపాధ్యాయులు నీలకంఠం రూపొందించిన దృశ్యకావ్యం సీడీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, సోది, నృత్యాలు, ఏకపాత్రాభియం, పాటలు, పిరమిడ్లు అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పాల్గొన్నారు.

### ఉపాధిహామీ బిల్లుల చెల్లింపుపై విచారణ చేయండి

మెదక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో గతేడాదిగా చేపట్టిన ఉపాధి హామీ పనుల బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ చేపట్టాలని మండలంలోని మాసాయిపేట, అచ్చంపేట, హకీంపేట, కొప్పులపల్లి తదితర గ్రామాల ప్రజలు, ఉపాధిహామీ కూలీలు డిమాండ్ చేశారు. పనికి రానివారి పేర్లకు కూడా చెల్లింపులు చేశారని పేర్కొన్నారు. మినీ బ్యాంకు సేవల చెల్లింపుల పేరుతో ఉపాధిహామీ కూలీలకు ఇప్పటివరకూ చెల్లింపులు చేయలేదని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### మార్కండేయ జయంతి

గుమ్మడిదల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహర్షి మార్కండేయ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, మార్కండేయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేకల యాదగిరి, డాక్టర్ ఆనంద్, కత్తుల రమేష్ పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.




ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి



జిన్నారం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పల్లకీసేవ

# బ్రహ్మోత్సవాలకు చల్లగిరి ఆలయం ముస్తాబు

- నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం
- పలు మండలాల్లో వసంత పంచమి వేడుకలు, ఆలయాల వార్షికోత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చల్లగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల కోసం ముస్తాబైంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయాన్ని భక్తులు చక్రతీర్థం అని పిలుస్తుంటారు. సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులో గుట్టపై దట్టమైన అరణ్యంలో 19వ శతాబ్దంలో చల్లగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వెలసిందని పూర్వీకులు తెలుపుతున్నారు. తిరుమలకు చెందిన కుచాచార్యులు తీర్థయాత్రలు చేస్తూ అప్పట్లో ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో సంచరిస్తూ ప్రస్తుతం నిజాంసాగర్‌లో ముంపునకు గురైన మిర్‌దొడ్డి గ్రామంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు తెలుపుతున్నారు. అప్పట్లో కుచాచార్యుడు పాలు తప్ప ఇతర ఆహారం తీసుకునేవారు కాదు. కొంతకాలం నల్లరంగు ఆవు పాలను మాత్రమే సేవిస్తుండేవాడు. కడ్పల్ సమీపంలో బావి దగ్గర ఆయన విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఆ గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి, లింగారెడ్డి, నర్సయ్య ఆయనను దర్శించుకొని శిష్యులుగా మారారని చెబుతారు. వారు ఆచార్యుడికి ప్రతిరోజు పాలు ఇతర సామగ్రిని అందజేస్తున్న క్రమంలో మిట్ట మధ్యాహ్నం పూట ఆవు జివ్వ చెట్టు దగ్గర నుంచి వచ్చి ఆచార్యుల వద్దనే ఉండడం ప్రారంభించింది. దీంతో కుచాచార్యులు ఉన్న చోటనే తాను ఉంటానని తెలిపి, అక్కడే ఉంటూ పూజలు ప్రారంభించినట్లు పూర్వీకులు తెలిపారు. ఆ రోజుల్లో ఓ రోజు అర్ధరాత్రి స్వామివారు కుచాచార్యులకు స్వప్నంలో వచ్చి చల్లగిరి చల్లగిరి గుట్టపై విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేయాలని ఉద్బోధించడంతో.. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటితంగా గుట్టపైన ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. గుట్టపై వెలసిన వెంకటేశ్వర స్వామిదేవాలయంలో కుచాచార్యుల వారసులే నేటికి పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 3న కుంకుమార్చన, హోమం, స్వామివారి తిరుకల్యాణం, గరుడసేవ, మంత్రపుష్పం, 4న వేద పారాయణం, చక్రతీర్థం, పూర్ణాహుతితోపాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకుపాత్రులు కావాలని వారు కోరారు.

**కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనలు**

వట్‌పల్లి, ఫిబ్రవరి 2 ( ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మేడుకుంద గ్రామంలో నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం రుద్ర హోమం, పంచసూక్త సహకార హోమం, దానదివాసం, అష్టోత్తర శత కలశ ఆరాధన, శైనాది వాసం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**ఘనంగా ఆదినారాయణస్వామి బ్రహ్మోత్సవాలు**

జిన్నారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కొడకంచిలో ఆదినారాయణస్వామి బ్రహ్మోత్సవాలు రెండోరోజు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ఆదినారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన కళ్యాణోత్సవం 4న జరుగనుండగా, 8న రథోత్సవం నిర్వహించనున్నారు.

**ఘనంగా వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం**

జహీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హోతి(బి) గ్రామంలో గల వీరాంజనేయస్వామి ఆలయం 5వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**దండుపల్లిలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన**

మనోహరాబాద్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గమ్మను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఒగ్గుకథలు, బోనాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా గ్రామానికి చెందిన నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ర్యాకాల కృష్ణగౌడ్, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్ తదితరులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

**'పేట'లో పోచమ్మతల్లికి బోనాలు**

పెద్దశంకరంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, తదితర సామగ్రిని సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు.

### విద్యా సరస్వతీ ఆలయంలో వసంత పంచమి



సరస్వతీ దేవీ అమ్మవారు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వసంత పంచమిని పురస్కరించుకొని సంగారెడ్డి డ్రైవర్స్ కాలనీలోని శ్రీ విద్యా సరస్వతిమాతా ఆలయం ముస్తాబైంది. సోమవారం ఉదయం 5 గంటల నుంచి సరస్వతి సూక్తములచే అమ్మవారికి కుంభాభిషేకం, పంచాసూక్తములతో పంచామృతాభిషేకం, 6 గంటలకు అలంకరణ, మంగళహారతి, మంత్రపుష్పములు, 7 గంటల నుంచి 9 గంటల వరకు కుంకుమార్చనలు, 9 గంటల నుంచి అక్షరాభ్యసములు, సాయంత్రం 6 గంటలకు ప్రదోష పూజ, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు మీనానాథ్‌శర్మ తెలిపారు.

**'బాల్యం'లో వసంత పంచమి వేడుకలు**

మనోహరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో బాల్యం పాఠశాల, బంగారమ్మ ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. కాళ్లకల్‌లోని బంగారమ్మ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బంగారమ్మను దర్శించుకున్నారు.

**జ్ఞాన సరస్వతీ ఆలయంలో అక్షరాభ్యాసాలు**

కంది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కందిలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆదివారం చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాస కార్యమక్రమం నిర్వహించారు. పూజారులు అమ్మవారికి విశేష అంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు.

**శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో..**

జహీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో, మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో ఆదివారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. మాణిక్‌ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి శివయోగిశివాచార్య మహాస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేసి వసంత పంచమి విశిష్టతను తెలియజేశారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు.

**వైకుంఠపురంలో సూర్య ప్రభవాహన సేవ**

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సూర్యప్రభవాహన సేవ, అరుణ సూక్తహవనం, సాయంత్రం చంద్రప్రభవాహనసేవ, ఎదుర్కోలు ఉత్సవ కార్యక్రమాలు జరిగాయి. సూర్యప్రభవాహన సేవలో దేవనాథజీయర్ స్వామి పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచర్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.

## కేసీఆర్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు

- మాజీ మంత్రి హరీశ్‌రావు



అమ్మవారి సేవలో హరీశ్‌రావు, సునీతారెడ్డి

కౌడిపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్లమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో పండిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచిన ఘనత అన్నారు. నాలుగు గ్యారంటీలు అధికారంలోకి రాగానే అమలుచేస్తామని చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రామగౌడ్, బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ఎల్లం, కాంతారావు, ప్రవీణ్, నవీన్, రాజు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి రెజ్లింగ్ కోచ్‌లుగా గణేష్, బాబూలాల్



గణేష్, బాబూలాల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ప్రాంతంలో ఫిజికల్ డైరెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్న రెజ్లింగ్ కోచ్‌లు గణేష్, బాబూలాల్ జాతీయస్థాయి రెజ్లింగ్ కోచ్‌లుగా తెలంగాణ నుండి ఎంపికయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని వారు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా.. ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండేరావు, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జీవ్లనాయక్, రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

## భవిష్యత్ పోరాటాలకు వేదికగా మహాసభలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ పోరాటాలకు వేదికగా మహాసభలు నిలిచాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఎం రాష్ట్ర మహాసభలో అనేక తరగతులకు సంబంధించిన సమస్యలపై తీర్మానాలు చేసిందన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో రాబోయేరోజుల్లో ప్రజా పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, సాయిలు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యావిధానం అమలు చేయాలి

- విద్వత్ సదస్సులో వక్తలు



విద్వత్ సదస్సులో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యావిధానం అమలు చేయాలని న్యాయవాది పట్లోళ్ల వీరారెడ్డి, లింగం సధాకర్‌రెడ్డి అన్నారు. శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన విద్వత్ సదస్సులో వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. జాతీయ విద్యావిధానం వల్ల విద్యార్థుల్లో వికాసం పెంపొందించడమే కాకుండా ప్రతి పౌరుడిలో హిందుత్వ నిష్ఠ, దేశ భక్తి, జాతీయ భావాలు కలిగి దేశం అభివృద్ధి చెంది ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉమామహేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవర్ధన్, సరస్వతి శిశుమందిర్ ప్రధానాచార్యులు నర్సింహాగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉపాధికూలీ బీమా ప్రవేశపెట్టాలి

గజ్వేల్/ గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు భూమి కలిగిన వ్యవసాయ కూలీలకు రైతు బీమాలాగా ఉపాధి కూలీ బీమా ప్రవేశపెట్టాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో 1,99,540 జాబ్‌కార్డుదారులుంటే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో 20 రోజులు పనిచేసిన కుటుంబాలకు మాత్రమే భరోసా ఇస్తామనే నిబంధనతో 75,187 కుటుంబాలు మాత్రమే అర్హత సాధించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, డివిజన్ కార్యదర్శి మైసయ్య, మండల సహాయ కార్యదర్శి జితేందర్ పాల్గొన్నారు.

### సిరి ఎంక్లేవ్‌లో చోరీ

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సిరి ఎంక్లేవ్‌లో శనివారం రాత్రి 1:30 ప్రాంతంలో చోరీ జరిగింది. మున్సిపాలిటీకి చెందిన సంతోష్‌రెడ్డి ఇంట్లో బంగారం, వెండి, నగదు దొంగలు ఎత్తుకెళ్లిన ట్టు సమాచారం. బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో చుట్టుపక్కల విచారణ చేపడతున్నట్లు తెలిపారు.

## బీరప్పగుడిని ధ్వంసం చేసిన దుండగులు




బీరప్పగుడి ప్రాంతాన్ని పరిశీలించిన స్థానికులు

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి ఈఎస్‌ఐ ఆసుపత్రి ఎదురుగా శతాబ్దకాలంగా పూజలందుకుంటున్న బీరప్పగుడిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. టీడీపీ నాయకుడు కరికె సత్యనారాయణయాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ మాట్లాడుతూ శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గుడిని ధ్వంసం చేయడమే కాకుండా గుడిలోని విగ్రహాలను సైతం తీసుకువెళ్లారని తెలిపారు. ఈ విషయమై సీఐ జగన్నాథ్‌కు ఫిర్యాదు చేశారు.

### ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా భారతి

కోహీర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కోహీర్ ఎంపీడీవో ఎన్.భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కోహీర్ ఎంపీడీవో భారతిని ఆయా మండలాల ఎంపీడీవోలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి, ఉపాధ్యక్షుడిగా పుల్కల్ ఎంపీడీవో ఆనందమేరి, కోశాధికారిగా సంగారెడ్డి ఎంపీడీవో యాదగిరిరెడ్డి, సభ్యులుగా ఆందోల్ ఎంపీడీవో రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### లక్ష డప్పుల కార్యక్రమానికి ఆర్థిక సహాయం



రూ.50 వేల నగదును అందజేస్తున్న కే.ప్రసాద్‌రెడ్డి

కోహీర్/జహీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు' కార్యక్రమాన్నికి సంబంధించి డప్పుల కొనుగోలు కోసం ప్రముఖ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ నాయకుడు కే.ప్రసాద్‌రెడ్డి రూ.50 వేల నగదును మండలాధ్యక్షుడు రవికుమార్‌కు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాందాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ముల్తానీ పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్ పట్టణంలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద లక్షడప్పులు-వేలగొంతులు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ ఆవిష్కరించారు.

### 'కారు' దిగి.. 'హస్తం' గూటికి..

మెదక్/చేగుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట కీలకనేతలు కారు దిగి హస్తం గూటికి చేరారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సరాఫ్ యాదగిరి, ఇద్దరు కౌన్సిలర్లు, మరో ఐదుగురు నాయకులు, చేగుంట మండలం బోనాల కొండాపూర్ మాజీ ఉపసర్పంచ్ రమేష్‌గుప్తా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నివాసానికి వెళ్లి, ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారిలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మరో కౌన్సిలర్ చింతల భవాని ఉన్నారు. చేగుంట నుంచి వెంకట్‌రెడ్డి, గ్రామాధ్యక్షుడు రమేష్, రామస్వామి, ప్రశాంత్, ప్రభాకర్, మహ్మద్, సిద్ధిరాములు పాల్గొన్నారు.

### గిరిజన గురుకులాన్ని సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

నర్సాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని గిరిజన గురుకులాన్ని గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ శరత్ ఆదివారం మెదక్‌కు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికారు. రానున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కాగా గురుకులంలో ఇతర సదుపాయలు, సౌకర్యాలు, భోజన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు శరత్ హామీఇచ్చారు.

## కమ్మేసిన గుర్రపుడెక్క



చెరువులో పెరిగిన గుర్రపుడెక్క

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామంలోని వెనకచెరువులో గుర్రపుడెక్క ఏపుగా పెరిగింది. విషపు పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. రాత్రి సమయాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. గ్రామాన్ని మున్సిపాలిటిలోకి మార్చిన తరువాత ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక గ్రామస్థులు మిన్నకుండి పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించాలని కోరుతున్నారు. అలాగే ముత్తంగి గ్రామానికి చెందిన చెత్తను పాశమైలారంకు పారిశ్రామిక వాడకు సంబంధించిన రోడ్డు పక్కన పారబోసి తగులబెడుతున్నారు. పొగలో కళ్లు మండడమే కాకుండా ఘాటైన వాసనలు వస్తున్నాయని గాయత్రీనగర్ కాలనీవాసులు చెబుతున్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్/హత్నూర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం విమర్శించారు. ఆదివారం సంగారెడ్డిలో కేవీపీఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 20 కోట్ల జనాభా ఉన్న దళితులకు దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో దళితులకు అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు దత్తు, నితిన్, శ్రీహరి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతుందని పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీం అన్నారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



సంగారెడ్డిలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు